రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం


గిడ్డయ్య (ఫైల్) శశికళ (ఫైల్) లక్ష్మి (ఫైల్) చంద్రమ్మ (ఫైల్)


ప్రమాదానికి కారణమైన వాహనం

- 14 మందికి తీవ్ర గాయాలు
- శ్రీశైలానికి వెళ్లి వస్తుండగా ఘోర దుర్ఘటన
- కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ట్రాలీ వాహనం బోల్తా
- మృతులందరూ ఆదోని ప్రాంత వాసులే
- ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

ఆత్మకూరు/ ఆదోని/కర్నూలు, మే 2(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలు పదో తరగతిలో పాసయ్యారన్న సంతోషంతో వారందరూ బంధుమిత్రులతో కలిసి శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారిని మృత్యువు కబళించి విషాదాన్ని నింపింది. వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి ఏకంగా నలుగురి ప్రాణాలు కోల్పోయారు. 14 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం చెరువు కట్ట సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. ఆదోని పట్టణంలోని రాయచోటి సుబ్బయ్యనగర్, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్‌తో పాటు గోనెగండ్ల మండలంలోని ఎర్రపాడు గ్రామానికి చెందిన సుమారు 28 మంది బంధుమిత్రులు గురువారం శ్రీశైలానికి ప్రైవేట్ వాహనంలో బయలుదేరి వెళ్లారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం శుక్రవారం మధ్యాహ్నం శ్రీశైలం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలోనే సిద్ధాపురం చెరువు కట్ట ఎదురుగా మరో వాహనం వస్తుండగా ఒక్కసారిగా డ్రైవర్ బ్రేక్ వేశాడు. వర్షం కురవడం వల్ల రహదారి చిత్తడిగా మారి వాహనం అదుపుతప్పి కుడిపక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో చెక్కలను ఏర్పాటు చేసుకుని పైభాగంలో కూర్చున్నవారు కింద పడగా వారిపై వాహనం బోల్తాపడి తిరిగి యథాస్థితిలో నిలిచింది. ఈ ఘోర దుర్ఘటనలో ఆదోనిలోని ఇందిరానగర్‌కు చెందిన గిడ్డయ్య (42), శశకళ (40), లక్ష్మి (28) అక్కడికక్కడే మృతిచెందగా మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌తో పాటు పలు ప్రైవేట్ వాహనాల్లో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చంద్రమ్మ (31) మృతిచెందింది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రులు లోకేశ్, భరత్, ఎమ్మెల్యే బుడ్డా

కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు మృతిచెందడంతో పాటు 14 మంది తీవ్ర గాయాలపాలైన ఘటనపై మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేలా అధికారులను ఆదేశించారు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

14 మందికి తీవ్ర గాయాలు

ఈ ప్రమాదంలో ఆదోనిలోని ఇందినగర్‌కు చెందిన సరస్వతి, వీణ, రాయచోటిసుబ్బయ్య కాలనీకి చెందిన మంగలి రంగస్వామి, రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన మంగలి గిరిధర్, మంగలి రాములమ్మ, 12 ఏళ్ల ప్రవీణ్ తేజ, గోనెగండ్ల మండలంలోని ఎర్రపాడుకు చెందిన కురువ కుమార్, మంగలి శిల్పా, మంగలి వీరేష్, మంగలి గోపిచంద్, 7ఏళ్ల హర్షణి, డ్రైవర్ సునీల్‌కుమార్‌తో పాటు మరొకరు గాయపడ్డారు. వీరిలో రంగస్వామికి మోకాళ్లు, మోచేతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరేష్, గిరిధర్‌లకు గడ్డం భాగంలో బలమైన రక్తగాయాలయ్యాయి. శిల్పాకు తలపై తీవ్ర గాయమైంది. ప్రవీణ్‌తేజ అనే బాలుడికి కుడికాలు విరిగింది. స్వల్ప గాయాలైన వారిని ఆత్మకూరులోనే చికిత్సలు అందించగా తీవ్ర గాయాలైన వారిని 108 అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎస్సై నారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చొరవ తీసుకున్నారు.


మల్లన్నను దర్శించుకున్న తర్వాత భోజనం అనంతరం తీసుకున్న గ్రూప్ ఫొటో

డిగ్రీ పరీక్షలు ఉన్నాయని ఆగిపోయా



డిగ్రీ పరీక్షలు ఉన్న కారణంగా మా అమ్మ శశికళ ఇంటి దగ్గరే ఉండమన్నది. సెలవులు ఉన్నందున కర్ణాటక నుంచి అక్క లక్ష్మి కూడా ఇంటికి రావడంతో, ఇంటి దగ్గరే ఉండిపోయాను. లేదంటే అమ్మతో పాటు నేను కూడా దైవదర్శనానికి వెళ్లి ఉండేవాడిని.

-అశోక్

మా అమ్మ బాగుందని చెప్పండి అంకుల్

మా అమ్మ శశికళకు ఏమి కాలేదని, బాగుందని చెప్పండి అంకుల్.. అంటూ.. మృతురాలు శశికళ కూతురు లక్ష్మి, కుమారుడు అశోక్ విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. దైవదర్శనానికి వెళ్లిన వారందరూ కూడా ఒకే కుటుంబసభ్యులేనని, తమ తల్లిదండ్రులకు ఎలా ఉందంటూ ఆరాతీశారు.

గూడ్స్ వాహనాల్లో ప్రయాణం వద్దంటున్నా..

ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాలకు చెందిన గూడ్స్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదమని తెలిపినా వాటినే ఆశ్రయిస్తున్నారు. శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా ఇదే తరహాలో బొలేరో, ఆటో ట్రాలీలపై చెక్క పలకలు వేసుకుని అధిక సంఖ్యలో వెళ్తుంటారు. ఆ సమయంలో పోలీసు, రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి గూడ్స్ వాహనాల్లో ప్రయాణాలపై నిషేధం విధించినా చాలా వరకు గూడ్స్ వాహనాల్లోనే ప్రయాణం కొనసాగించేవారు. సురక్షితమైన ప్రయాణం చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మృతుల్లో ఇద్దరు తోడికోడళ్లు.. మరొకరు ఆడపడుచు

రోడ్డు ప్రమాదంలో చనిపోయినవారిలో ఇద్దరు తోడికోడళ్లు, వారి ఆడపడుచు ఉన్నారు. సెలూన్ షాప్ నిర్వహిస్తూ బతుకుబండి సాగిస్తున్న అన్నదమ్ములు, బావమర్దుల కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. ఆదోని పట్టణం రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన ఎం.రాజు, గిరి అన్నదమ్ములు. వీరికి గిడ్డయ్య, రంగస్వామి, రామాంజీ బావమరుదులు. వీరంతా రాజీవ్‌గాంధీ నగర్, ఇందిరానగర్‌లో ఉంటున్నారు. వేసవి సెలవులు కావడంతో ఈ ఐదు కుటుంబాలతో పాటు గోనెగండ్ల మండలం ఎర్రబాడుకు చెందిన బంధువులు దాదాపు 28 మంది ట్రాలీ ట్రాలీ వాహనంలో శ్రీశైలం వెళ్లారు. రామాంజీ కుమారుడు అరవింద్, గిడ్డయ్య కుమారుడు అభి, రాజు కుమార్తె అర్చన్ పదో తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కు తీర్చుకోవాలని శ్రీశైలం వెళ్లారు. ఈ ప్రమాదంలో రాజు భార్య లక్ష్మి, గిరి భార్య చంద్రమ్మ మృతి చెందారు. రాజు అక్క శశికళ, బావమరిది గిడ్డయ్య మృత్యువాత పడ్డారు. మృతురాలు లక్ష్మికి భర్త, ఇద్దరు కూతుళ్లు, కొడుకు, చంద్రమ్మకు కొడుకు, కూతురు, శశికళకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గిడ్డయ్యకు కొడుకు, కూతురు ఉన్నారు.

అయ్యో.. ఆర్‌యూ



విశ్వవిద్యాలయాలు భావ సంఘర్షణ కేంద్రాలుగా వికసించాలి. నిరంతర నూతన అధ్యయనాలకు నెలవు కావాలి. ప్రజలు గర్వించదగ్గ మేధావులుగా ఆచార్యులు విద్యార్థులను ప్రభావితం చేయాలి. దేశ మేధో అవసరాలు తీర్చే సృజనాత్మక పరిశోధనలు జరుగుతూ ఉండాలి. విషాదకరంగా ఇవేవీ రాయలసీమ విశ్వవిద్యాలయంలో లేవు. అక్కడ గ్రంథాలయంలోని పుస్తకాలు చెదపట్టిపోతున్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించిన పరికరాలు, సాంకేతిక ఏర్పాట్లు నిరుపయోగంగా తయారయ్యాయి. చివరికి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ల నిర్వాకానికి, అధికారుల నిర్లక్ష్యానికి ఇది చాలు. నిత్యం అంతర్గత వివాదాలతో ఆర్‌యూ కునారిల్లిపోతున్నదని, బోధన, అధ్యయనం, పరిశోధన ఊసే లేదనే విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఉపకులపతులు ఏసీ గదులకే పరిమితం కావడం, అధ్యాపకులు చదువులు చెప్పక పోవడం, అసలు విశ్వవిద్యాలయం సమాజంలో భాగమనే స్పృహ లేకపోవడం వంటి జాడ్యాలతో నిరాశాపూరిత వాతావరణం నెలకొని ఉంది. ఆర్‌యూ ఎన్నటికైనా సరైన దారిలోకి వస్తుందా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- విశ్వవిద్యాలయ లైబ్రరీలో పుస్తకాలకు చెదలు
- 19 విభాగాల్లో వైఫై టెక్నాలజీ నిరుపయోగం
- రూ. కోట్లతో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు..
- ఎంఈడీలో నిరుపయోగంగా ఉన్న రూ. కోట్ల పరికరాలు
- గెస్టు హౌస్ ఉన్నా ప్రైవేట్ లాడ్జీలకు ఏటా రూ. 5 లక్షలు
- ఐడీ కార్డు లేకుండానే విద్యార్థుల చదువులు

కర్నూలు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయ పాలన పూర్తిగా గాడి తప్పింది. గతంలో వర్సిటీ ఖజాన నుంచి దాదాపు రూ. 20 కోట్లతో భవనాలు, పరికరాలు, గెస్టు హౌస్ లాంటి సౌకర్యాలను కల్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని సెంట్రల్ వర్సిటీ స్థాయిలో సౌకర్యాలు సమకూర్చాలనే లక్ష్యంతో నిధుల కేటాయించారు. నిర్మాణాలు చేపట్టారు. ఆధునిక టెక్నాలజీ సౌకర్యాలు సమకూర్చారు. అయితే వాటిని సద్వినియోగం చేసుకునేందుకు సరైన అధికారులు, సూచనలు చేసే నాయకత్వం లేదు. ప్రొఫెసర్లు తమ ఆధిపత్యం కోసం విద్యార్థులను వర్గాలుగా చీల్చి ఓ సామాజిక వర్గం పేరు చెప్పుకుని వారి అండతో భూములను కాజేసి, విలువైన ఆస్తులను నిర్వీర్యం చేస్తూ అభివృద్ధికి ఆటంకంగా మారారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు చదువు చెప్పడంలో ప్రొఫెసర్లు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నియమించిన కొత్త ఉపకులపతి అయినా వీటిపై దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగంలోకి తీసుకరావాలని, ఉచిత వైఫై అందుబాటులోకి తీసుకు రావాలని విద్యార్థులు కోరుతున్నారు.


డేటా సెంటర్

2008 వర్సిటీలో రూ. 8 కోట్లతో సెంట్రల్ యూనివర్సిటీ తరహాలో వర్సిటీలో అండర్ గ్రౌండ్ టెక్నాలజీతో యూనివర్సిటీలో 19 విభాగాలతో ఉచితంగా విద్యార్థులకు అందించేందుకు వైఫై టెక్నాలజీని తీసుకువచ్చారు. కానీ ముచ్చటగా 6 నెలలు మాత్రమే విద్యార్థులకు ఉపయోగపడింది. ఆ తర్వాత నిరుపయోగంగా మారింది. ఆదే విధంగా వర్సిటీలో ఎంబీఏ విభాగం ఏర్పాటు అయ్యాక వాటికి ప్రత్యేకమైన లైబ్రరీ ఏర్పాటు చేసి రూ. 25 లక్షలతో పుస్తకాలు కొన్నారు. కానీ వాటికి నేటికి అడిట్ లేదు... అధికారి లేదు. వినియోగం లేక పుస్తకాలకు చెదపడుతున్నాయని విద్యార్థులు అంటున్నారు.



లైబ్రరీ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనింగ్ ల్యాబ్

ఎడ్యుకేషన్ విభాగం కోర్సు ప్రారంభంలో కోర్సు ఉపయోగం కోసం విద్యార్థులకు నూతన టెక్నాలజీ కోసం కోట్ల రూపాయలు కేటాయించి పరికరాలు కొన్నారు. ప్రస్తుతం కోర్సు రద్దు కావడంతో పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. వర్సిటీలో పాత లైబ్రరీ, 3వ బిల్డింగ్‌తోపాటు బాలుర వసతి గృహంలో తుంగభద్ర, కృష్ణ బిల్డింగ్, మెస్ హాలు, క్యాంటీన్, బిల్డింగ్‌లు ఖాళీగా ఉండటంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

మరుగున పడ్డ గెస్టు హౌస్.. ప్రైవేట్ లాడ్జీల కోసం ఏటా. 5 లక్షలు

రాయలసీమ యూనివర్సిటీలో గెస్టు హౌస్ కోసం గతంలో రూ. 2 కోట్ల వర్సిటీ నిధులతో నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఆలనా పాలన లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. ఉన్న వాటిని ఉపయోగించుకోకుండా వచ్చిన అతిథుల కోసం ప్రైవేట్ లాడ్జిలపై ఆధార పడుతున్నారు. దీని వల్ల ప్రతి ఏటా లాడ్జీలకు వర్సిటీ నిధుల నుంచి దాదాపు రూ. 5 లక్షల వరకు తగలేస్తున్నారని విద్యార్థులు విమర్శిస్తున్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు లేవు

వర్సిటీలో చదివే విద్యార్థులకు జాయిన్ అయ్యాక ప్రారంభంలోనే ఐడీ కార్డు వర్సిటీ అధికారులు ఇస్తారు. కానీ గత కొన్ని సంవత్సరాల నుంచి విద్యార్థులకు ఐడీ కార్డు ఇవ్వడం లేదు. ఇటీవల కొత్త ఉపకులపతి వద్ద విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు తమకు ఐడీ కార్డులు మంజూరు చేయాలని వేడుకున్నారు.

కొత్త అకడమిక్‌లో ప్లాన్ చేస్తా

వర్సిటీ క్యాంపస్‌లో నిరుపయోగా చాలా బిల్డింగ్‌లు ఉన్నట్టు కొంత మంది విద్యార్థులు తెలిపారు. వేసవి సెలవుల్లో పరిశీలించి కొత్త అకడమిక్ ఇయర్‌లో తగిన ప్లాన్ చేస్తాం. ఇంజనీరింగ్ కళాశాలకు కొత్త ల్యాబ్స్ మంజూరు అయ్యాయి. విద్యార్థుల అవసరాల కోసం నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగం చేసే దిశగా ప్రయత్నిస్తాం.

- వి. వెంకట బసవరావు, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ

'నీట్'ను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్


చీఫ్ సూపరింటెండెంట్లకు సూచనలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 2(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఈనెల 4న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నీట్ పరీక్షపై శుక్రవారం పరీక్షల కోఆర్డినేటర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, టెక్కె ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1172 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు(ఆధార్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్)తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తప్పనిసరిగా తెచ్చుకోవాలని అన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందని, ఉదయం 11గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్ క్లోజ్ చేస్తారని, తర్వాత విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రతి పరీక్ష కేంద్రంలో ద్విచక్ర చైర్‌లను ఏర్పాటు చేయాలని కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏ ఒక్క చిన్న ఘటన జరుగకుండా పరీక్ష సజావుగా జరిగేలా చూడాలని పోలీసులను ఆదేశించామన్నారు.. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను పోలీసుల సహకారంతో తీసుకు రావాలని ఆదేశాలు జారీచేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులను మూసివేయించాలని, విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలని, పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వెలుతురు ఉండేలా చూసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

వర్సిటీకి మంచి పేరు తేవాలి

డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు సభలో ఉపకులపతి



మాట్లాడుతున్న ఉపకులపతి వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను పూర్తి చేసుకొని బయటికి వెళ్తున్న విద్యార్థులు తల్లిదండ్రులకు, యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఉపకులపతి వి. వెంకట బసవ రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం రాయలసీమ యూనివర్సిటీలోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో ద్వితీయ సంవత్సరం వీడ్కోలు ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కారంతోనే చదువుకు సార్థకత చేకూరుతుందని అన్నారు. ఆ దిశగా విద్యార్థులంతా కృషి చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. పోటీ పరీక్షలకు హాజరై జీవితంలో వీలైనంత త్వరగా స్థిరపడాలని హితవు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడాంశాలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బి. విజయకుమార్, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్స్ సుందరానందపుచ్చా, ఆర్. భరత్ కుమార్, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తుది కసరత్తు

- అమరావతి పునర్నిర్మాణ సభలో సీఎం చంద్రబాబు
- మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు సహా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరు

6



అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి


పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం


● కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

● సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు


మహిళల విజయ దరహాసం

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి




దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు


సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు


సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు


గ్యాలరీల బయట జనం

ప్రజల సొమ్ము దుర్వినియోగం

● అప్పు తెచ్చి రాజధాని నిర్మాణం చేపట్టడం విడ్డూరం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని అమరావతి పర్యటనలో ప్రజల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014లో చంద్రబాబు హయాంలో పిడికెడు మట్టి, చెంబు నీళ్లు తీసుకువచ్చిన నరేంద్ర మోదీ.. ఇప్పుడొచ్చి ఏమి చేయబోతున్నారో తెలియాలని అన్నారు. మోదీ పర్యటనకు 6 వేల బస్సులను ఉపయోగించి ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో నరేంద్ర మోదీ రాష్ట్రానికి అప్పులు తప్ప ఏమీ ఇవ్వడం లేదన్నారు. లక్ష కోట్ల రూపాయలు అప్పు తెచ్చి రాజధాని నిర్మాణం చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, ప్రాంతాల మధ్య వివాదం ఉండకూడదనే వైసీపీ ఉద్దేశమని అన్నారు. సమావేశంలో నగర మేయర్ బీవై రామయ్య, కార్పొరేటర్లు మునెమ్మ, విక్రమసింహారెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, రాజేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

● 67 శాతం అర్హత సాధించిన విద్యార్థులు

● ఉమ్మడి జిల్లాల్లో 93 మార్కులతో టాపర్‌గా నిలిచిన షేక్ షఫీ



నంద్యాల ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో 1733 మంది విద్యార్థులు అర్హత మార్కులు సాధించారు. 2948 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 2586 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 67శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల పట్టణం బొమ్మల సత్రం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న షేక్ షఫీ, షేక్ హసీనాల కుమారుడు షేక్ సరోజ్ 100కి 93 మార్కులు సాధించి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల టాపర్‌గా నిలిచి నంద్యాల చాపిరేవుల మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యాడు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తుది కసరత్తు

● ఆ దిశగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం

● కేంద్ర నిధులతో ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి

● రానున్న డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమలు

● అమరావతి పునర్నిర్మాణ సభలో సీఎం చంద్రబాబు

● వెనుకబడిన రాయలసీమపై ప్రత్యేక ఫోకస్

● మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు సహా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరు


ప్రధాని మోదీ హాజరైన అమరావతి పునర్నిర్మాణ సభలో జాతీయ జెండాతో మంత్రి టీజీ భరత్, ఇతర మంత్రులు

కర్నూలు, మే 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శుక్రవారం అమరావతి పునర్నిర్మాణ సభ జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన, ఉమ్మడి జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ అభివృద్ధిపై ఫోకస్ పెట్టామని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు తుది కసరత్తులో భాగంగా వేగంగా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. , ఓర్వకల్లు కారిడార్‌ను కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేయబోతున్నామని, ఓర్వకల్లు కేంద్ర ఏరోస్పేస్ డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ పవర్ యూనిట్లు రాబోతున్నాయని వివరించారు. సీఎం చంద్రబాబు ప్రసంగంలో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. నవ్యాంధ్ర దిశను మార్చే ప్రధాని మోదీ పాల్గొన్న సభలో కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలు, అభివృద్ధిపై చంద్రబాబు ప్రసంగించడంతో .. రాబోయే రోజుల్లో ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతుందని, హైకోర్టు బెంచ్ హామీ అమలుకు చంద్రబాబు చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నారని మంత్రి టీజీ భరత్, టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. ఆ వివరాలు పరిశీలిస్తే..

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు వేగంగా అడుగులు



ప్రధాని మోదీ పాల్గొన్న అమరావతి పునర్నిర్మాణ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమలో రక్షణ రంగ (డిఫెన్స్) సంస్థలు ఏర్పాటు చేశామని, హైకోర్టు బెంచ్ ఏర్పాటులో భాగంగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. దీనిపై జిల్లా న్యాయవాదులు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడు రాజధానుల పేరిట కర్నూలు న్యాయ రాజధాని అంటూ మాయమాటలతో మభ్యపెట్టారు. అయితే.. నాడు ప్రతిపక్ష నేత హోదాలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుతీరగానే ఇచ్చిన హామీ అమలులో ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబరు 21న అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బెంచ్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని కోరుతూ లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి అక్టోబరు 28న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. ప్రధాని మోదీ పాల్గొన్న సభలో సీఎం చంద్రబాబు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై స్పష్టంగా వివరించడం పట్ల జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర నిధులతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేంద్ర నిధులు ఇచ్చింది. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక పురోగతికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ అభివృద్ధిలో భాగంగా నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్‌ఐసీడీపీ) ఫేజ్-1 కింద రూ.2,786 కోట్లతో 2,612 ఎకరాల్లో అభివృద్ధికి డిజైన్ చేశారు. వివిధ పరిశ్రమలు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. ఇక్కడ రూ.100 కోట్లతో డ్రోన్ సిటీ ఏర్పాటుకు గరుడ ఏరో స్పేస్ సంస్థ కసరత్తు తుది దశకు చేరింది. ఇప్పటికే భూములు కూడా పరిశీలించారు. ఆ సంస్థ సీఈవో అగ్రీశ్వర్‌జయప్రకాశ్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్‌నాయుడుతో చర్చించారు. ఇప్పటికే ప్రపంచంలోనే తొలి 1000 మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ పార్కు, 3,680 మెగావాట్ల పంప్డ్‌స్టోరేజీ పవర్ యూనిట్లు వచ్చాయి. మరిన్ని గ్రీన్ ఎనర్జీ పవర్ ప్రాజెక్టులు రాబోతున్నాయని సీఎం చంద్రబాబు కరువుసీమ ప్రజలకు తీపి కబురు అందించారు.


చిప్పగిరి మండలం నంచర్ల దగ్గర మల్లప్పగేట్ రైల్వే స్టేషన్

సభలో జిల్లా తెలుగు తమ్ముళ్లు

అమరావతి సభకు జిల్లాకు చెందిన పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే, నేషనల్ హైవే ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాన

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ అమరావతిలో శంకుస్థాపనలు చేశారు. రూ.695 కోట్లతో నంద్యాల జిల్లాలో చేపట్టిన 167కే జాతీయ రహదారి నిర్మాణం పనులు, రూ.293 కోట్లతో చేపట్టిన చిప్పగిరి మండలం మల్లప్పగేట్ (నంచర్ల) - గుంతకల్లు వేస్ రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) డబ్లింగ్ బైపాస్ రైల్వేలైన్‌కు శంకుస్థాపన చేశారు. గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్, విద్యుదీకరణ పనుల్లో భాగంగా రూ.184 కోట్లతో నిర్మించిన బి.సిమెంట్ నగర్ - కేఈఎఫ్ పాణ్యం మధ్య 19.04 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు.


అమరావతి సభలో జిల్లాకు చెందిన ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, గిత్తా జయసూర్య, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా ఎంపికైన ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు


అమరావతికి చేరుకున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, చిత్రంలో సీఎం చంద్రబాబు

స్వల్పంగా తగ్గిన పత్తి ధర

● గరిష్ఠ ధర క్వింటం రూ. 8,081



ఆదోని మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడి

ఆదోని అగ్రికల్చర్, మే 2(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు శుక్రవారం స్వల్పంగా తగ్గాయి. గరిష్ఠంగా క్వింటం రూ.8,081 పలికింది. గత వారంతో పోల్చితే క్వింటానికి రూ.150 తగ్గింది. ధరలు మరింత పెరుగుతాయని పత్తి రైతులు ఆశించారు. మళ్లీ ధరలు పతనమవుతుండడంతో నిరాశ చెందుతున్నారు. 478 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5 వేలు, మధ్యస్థ ధర రూ.7,675 పలికింది.

డెంగీ కేసు నమోదు

దేవనకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): దేవనకొండలో మూడేళ్ల బాలికకు డెంగీ బారిన పడిన్నట్లు వైద్యాధికారి విజయభాస్కర్ తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న బాలికను కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. రక్త పరీక్షలు నిర్వహించగా డెంగీ సోకినట్లు తేలింది. గ్రామాలలో అధిక జ్వరంతో బాధపడుతున్న వారు వైద్యశాలలో రక్తపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వైద్యాధికారి సూచించారు. దేవనకొండలో పారిశుధ్య పనులు చేసి, దోమల నివారణకు మందులు పిచికారీ చేశారు. వైద్య సిబ్బంది రంగస్వామి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గూడూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. వివరాలు.. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన తిప్పన్న(26) బైక్‌పై పోలకల్ నుంచి గూడూరుకు వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ గూడూర్ సమీపంలో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తిప్పన్నకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

క్రిష్ణగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.హెచ్. ఎర్రగుడి గ్రామానికి చెందిన రైతు బంగారు గళ్ళి రమేష్ (32) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గ్రామస్థుల సహకారంతో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి రెండు ఎకరాల స్వంత పొలంతో పాటు నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మూడు సంవత్సరాలుగా పంటలు సాగు చేస్తున్నాడు. పంటల సాగు కోసం రూ. 5లక్షలు అప్పు చేశాడు. అయితే పంటలు సరిగా రాక అప్పులు తీర్చే మార్గంలేక జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ పోస్టుల మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు హాస్పిటల్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించిన నాలుగు ఉద్యోగ కేటగిరీ అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టులు, సెలక్షన్ కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 సెట్లు నకలు సర్టిఫికెట్లతో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. హాజరు కాని అభ్యర్థుల ఎంపిక రద్దు చేస్తామని పేర్కొన్నారు.

కవులకు, కళాకారులకు పుట్టినిల్లు రాయలసీమ

అరుణ భారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి



మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి



కళాకారుడిని సత్కరిస్తున్న ప్రముఖులు

బనగానపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): కవులకు, కళాకారులకు పుట్టినిల్లు రాయలసీమ అని అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్‌లోని బీసీ గురెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు జితేంద్ర మిమిక్రీ కళా ప్రదర్శన, గిన్నీస్‌వరల్డ్ రికార్డు హోల్డర్ షేక్ కరీముల్లా బృందంచే జానపద నృత్యాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కరీముల్లా నటరాజ కళామందిర్ వారిచే కూచిపూడి, భరతనాట్యం జానపద నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డిని జీజీ వెంకటేశ్ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి నవీన్‌కుమార్ చౌదరి, గజల్ కళాకారుడు మహమ్మద్‌మియా, ఇనాయతుల్లా ఘనంగా సత్కరించారు. అనంతరం బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అంటే కవులు, కళాకారులకు పుట్టినిల్లు అన్నారు. ప్రముఖ కవులు యోగి వేమన, అన్నమయ్య, పోతులూరు వీరబ్రహ్మంగారు, పుట్టపర్తి నారాయణాచార్యులు, గడియారం శేషాచలం వంటి ఎంతో మంది జన్మించిన నేల రాయలసీమ అన్నారు. ప్రస్తుత సమాజంలో కవులు, కళాకారులు నిరాదరణ గురికావడం బాధాకరమన్నారు. కవులు, కళాకారులను ఆదరించేవారు కరువయ్యారన్నారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కళాకారులే కీలక పాత్రధారులన్నారు. ప్రముఖ సినీ నటుడు సుమన్, శివారెడ్డి, జయప్రకాశ్‌రెడ్డి, గోరేటి వెంకన్న, గరికపాటి నరసింహారావు వంటి కళాకారులను ఆదరించిన ఘనత అరుణ భారతి సంస్థదని అన్నారు. జితేంద్ర మిమిక్రీ, కరీములా బృందం నిర్వహించిన జానపద నృత్యప్రదర్శలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అరుణభారతి సాహితీ సంస్థ కార్యదర్శి రామశేషయ్య, బలరామయ్య, భరతుడు, మగ్బుల్, బొబ్బల మహేశ్వరరెడ్డి, జ్యోతిష్యం వెంకటరాముడు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాళ్లపై ఆర్జేడీ ఆగ్రహం

● సప్లిమెంటరీలోనైనా అందరూ పాసయ్యేలా చూడాలని ఆదేశం



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, తల్లిదండ్రులను అభినందిస్తున్న కడప ఆర్జేడీ శ్రీనివాసులు, జిల్లా అధికారులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ పరీక్షలో తక్కువ ఉత్తీర్ణత శాతం సాధించిన కళాశాల ప్రిన్సిపాళ్లపై ఇంటర్ బోర్డు రీజనల్ డైరెక్టర్ కడప ఏ. శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షకైనా క్లాసులను పకడ్బందీగా నిర్వహించి ఫెయిలైన విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఆర్జేడీ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళశాలలో ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కడప ఆర్జేడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ శాతాన్ని పెంచాలని తెలిపారు. అలాగే విద్యాసంవత్సర పని దినాలను 220 నుంచి 235 రోజులకు పెంచినట్లు తెలిపారు. ఈసారి పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి నెలలోనే నిర్వహించడానికి ఇంటర్ బోర్డు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఎంబైపీసీ కోర్సును అమలు చేస్తున్నట్లు ఆర్జేడీ తెలిపారు. ఇది ఎంపీసీ, బైపీజీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అలాగే త్వరలో జరిగే అధ్యాపకుల బదిలీలకు సంబంధించిన సమాచారాన్ని పక్కాగా ఉండాలన్నారు. ఏదైనా పొరపాట్లు జరిగితే అందుకు కళాశాలల ప్రిన్సిపాల్స్ జిల్లా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తప్పుచేస్తే ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. అనంతరం టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో జిల్లాలో టాపర్, తల్లిదండ్రులను కడప ఆర్జేడీ, జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డీఐఈవో సురేష్‌బాబు, ఆర్ఐవో గురువయ్య శెట్టి, ప్రిన్సిపాళ్లు లాలెప్ప, సుంకన్న పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం:

ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన కర్నూలు బీ.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను ఇంటర్ బోర్డు రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు శాలువ కప్పి సన్మానించారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 82 శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ఆర్జేడీ ప్రత్యేకంగా ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను అభినందించారు.

సీమకు తరతరాల అన్యాయం

- రూ.1500 కోట్లు కేటాయిస్తే 10లక్షల ఎకరాలకు సాగునీరు
- కర్నూలులోనే కృష్ణాబోర్డు ఏర్పాటు చేయాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



రుద్రవరంలో తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

రుద్రవరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమకు తరతరాలుగా పాలకులు అన్యాయం చేస్తూనే వస్తున్నారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని తహసీల్దారు కార్యాలయం ముందు రైతులతో కలిసి తెలుగుగంగ ప్రాజెక్టుపై ధర్నా నిర్వహించి తహసీల్దారు మల్లికార్జునరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా రాయలసీమ తాగునీటి, సాగునీటికై కేటాయించాలని అన్నారు. కృష్ణానది యాజమాన్యం బోర్డు కర్నూలులోనే ఏర్పాటు చేయాలని, రూ.1500 కోట్లు కేటాయిస్తే వచ్చే ఖరీఫ్ నాటికి పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలవుతుందని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో ప్లంజ్‌పూల్‌కు మరమ్మతు చేయాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు జీవితకాలం పెంచడానికి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రతి సంవత్సరం 30 లక్షల నుంచి కోటి ఎకరాలకు సరిపడే కృష్ణాజలాలు సముద్రంపాలు అవుతున్నాయన్నారు. తుంగభద్ర, కృష్ణా, పెన్నానదులు ఈ ప్రాంతం మీదుగా ప్రవహిస్తున్నాయని, రాయలసీమ ప్రాంతంలో సాగునీటికి పంట పొలాలకు పరిశ్రమలకు, విద్య, వైద్య సంస్థలకు అందించడానికి కావాల్సిన నీటి హక్కులున్నాయని అన్నారు. పాలకుల విధానాల వల్ల రాయలసీమ వెనుకబడిపోయిందని అన్నారు. కృష్ణాజలాలను సక్రమంగా వినియోగించుకోవడానికి క్రిష్ణానది యాజమాన్యం బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వెలుగోడు రిజర్వాయరు, చెన్నై కాల్వ (తెలుగుగంగ కాల్వ) పూర్తి స్థామర్యంలో పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామగుర్విరెడ్డి, పార్థసారథిరెడ్డి, హరిక్రిష్ణ, రామక్రిష్ణారెడ్డి, మహబూబ్‌బాషా, దేవానందరెడ్డి, మహేంద్రరెడ్డి, వీరబ్రహ్మానందరెడ్డి, కొమ్ము శ్రీహరి పాల్గొన్నారు.

30వేల మందితో సిద్ధేశ్వరం అలుగు వార్షికోత్సవ సభ

ఈ నెల 31న సిద్ధేశ్వరం అలుగు 9వ వార్షికోత్సవం 30వేల జనాభాతో నిర్వహిస్తామన్నారు. జలమేజీవం, జలమే బలం, జలమే సర్వం అన్నారు. రాయలసీమలోని ప్రతి రైతు 31వతేదీన సంగమేశ్వరం చేరుకుని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు పదో తరగతి విద్యార్థులకు సత్కారం

● డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా ఘనంగా సత్కరించనున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమమార్కులు సాధించిన విద్యార్థులతోపాటు వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల హెచ్ఎంలను సత్కరించనున్నారు.

100శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు

ఆళ్లగడ్డ బాలికల ఎపీఆర్‌పీఆర్‌పీ పాఠశాల, బాలికల బీసీ వెల్ఫేర్ పాఠశాల, దొర్నిపాడు మండలం అమ్మిరెడ్డినగర్ కేజీబీవీ, కొత్తపల్లె జడ్పీ హైస్కూల్, కొత్తపల్లె మండలం గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాల, పాములపాడు ఏపీ మోడల్ స్కూల్, పాణ్యం మండలం నెరవాడ బీసీ వెల్ఫేర్ స్కూల్, రుద్రవరం కేజీబీవీ, శ్రీశైలం బీసీ వెల్ఫేర్ స్కూల్.

సత్కారం పొందనున్న బీసీ వెల్ఫేర్‌లో పాఠశాలల్లో

శ్రీశైలం పింజరి రంజన్ - 592, నెరవాడ బాలహారిక - 589, శ్రీశైలం డ్యామ్ ఈస్ట్ ఆవుల వేదసాయి కృష్ణ - 588, నెరవాడ బాలికలపాఠశాల జయమాధవీబాయి - 588, గడివేముల బీసీ హాస్టల్ స్వామినాథ్ - 579

- ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉన్నత పాఠశాలల్లో
కోవెలకుంట్ల చిలుకూరి హుశ్శేన్‌బాషా - 589, ఆళ్లగడ్డ సయ్యద్ మహ్మద్ ఆలీ అబ్బాస్ - 575, ఆళ్లగడ్డ షేక్ షహనాజ్ - 574
- **ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో:** పాణ్యం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో వరుసగా శ్రీరామ ఇందు - 570, కురువ రజిత - 558, కొండా ఇంద్రాణి -553,
- **కేజీబీవీల్లో:** సంజామల ఆలమూరి వర్షిణి - 579, రుద్రవరం లింగంది స్నేధరణి - 575, గోస్పాడు బొగ్గు కార్తీక్-571,
- **మున్సిపల్ పాఠశాలల్లో :** నూనెపల్లె మున్సిపల్ స్కూల్‌లో వరుసగా రాధిక-586, తొగట మణిశంకర్-579, దివ్యశ్రీ - 578
- **ఏపీ మోడల్ స్కూల్స్‌లో:** పాములపాడు మోడల్‌స్కూల్‌లో వరుసగా పదిరే మల్లన్న - 593, జయయశస్విని - 591, గడివేముల హైమావతి -589
- **సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో:** ఆళ్లగడ్డ బాలికల రెసిడెన్సియల్ స్కూల్‌లో వరుసగా మానికింది కీర్తన - 590, వర్షిత - 585, గడ్డం కావ్యసుధ -578.
- **ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో:** శ్రీశైలం డ్యామ్ వెల్ఫేర్ పాఠశాలలో వరుసగా రేవంత్‌నాయక్-590, ఈశ్వర్‌నాయక్ - 584, శ్రీనివాసులనాయక్ - 579.
- **జడ్పీ ఉన్నత పాఠశాలల్లో:** యల్లావత్తుల జడ్పీలో సాధునాగేంద్ర బాబు - 592, బండిఆత్మకూరు జడ్పీ పాఠశాలలో నీలకంఠంసుమంత్ - 591, డోన్ బాలికల జడ్పీలో బోయ విజయలక్ష్మి - 590.
- **ఎయిడెడ్ పాఠశాలల్లో :** సెయింట్ జోసఫ్స్ బాలికల పాఠశాలలో వరుసగా ముల్లాఆస్మాఫర్హీన్ - 580, లోహిత - 567, పఠాన్ అక్షిన్ వాసిఫా - 566

ఈ-శ్రమ్ కార్డులు అందేలా కృషిచేయాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి
- కార్మికులకు కార్డులు అందించేందుకు బృందాలు: అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు
- పారా లీగల్ వలంటీర్లకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు తమ ప్రాంతాల్లో ఉన్న అసంఘటిత కార్మికుల జాబితాను తయారుచేసి వారికి ఈ-శ్రమ్ కార్డులు అందేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా పారా లీగల్ వలంటీర్లకు స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పలురంగాల్లో కార్మికులు ఉన్నారని, వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారాలీగల్ వాలంటీర్లు సహకరించాలని తెలిపారు. ఈ-శ్రమ్ కార్డులతో కలిగే ప్రయోజనాలను కార్మికులు వినియోగించుకోవాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులు ఈశ్రమ్ కార్డుల కోసం ఈశ్రమ్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న కార్మికులకు ఈశ్రమ్ కార్డులు అందజేసేందుకు పలు టీంలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు అసంఘటిత కార్మికుల జాబితాను రూపొందిస్తారని తెలిపారు.

భూ తగాదాలే హత్యకు కారణం

- కాంగ్రెస్ నేత హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు
- హత్య కేసులో 10 మందిపై కేసులు
- ముగ్గురిని అరెస్టు చేసిన అడిషనల్ ఎస్పీ
- పరారీలో ఏడుగురు నిందితులు



నిందితుల అరెస్టును చూపుతున్న అడిషనల్ ఎస్పీ

ఆలూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఏప్రిల్ 27వ తేదీన గుంతకల్ సమీపంలో టిప్పర్‌తో ఢీకొట్టి ఆపై వేట కొడవళ్లతో నరికి హత్య చేసిన కేసులో పోలీసులు లోతుగా విచారణ జరిపారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా నేతృత్వంలో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ హత్య కేసులో గుంతకల్‌కు చెందిన రాజేష్, బేపర్ గౌసియా, కత్రిమాల సౌభాగ్యలను శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలో ఆలూరు రోడ్డులో గాయత్రి ఫంక్షన్‌హాల్‌ల వద్ద ఉన్న 1.10 ఎకరాల ఇళ్ల స్థలాల భూమి, సిద్ధార్థ కాలనీలో 9 ఎకరాల దేవదాయ భూమి, పెద్దన్నకు సంబంధించిన 8ఎకరాల భూమిని కాంగ్రెస్ నేత చిప్పగిరి లక్ష్మీనారాయణ అడ్డు వచ్చి తనకు కాకుండా చేసి ఆయనకు సహకరిస్తున్న రాజేష్, గౌసియాను దూషించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించడంతో కక్ష పెంచుకున్నారని, ఎలాగైనా లక్ష్మీనారాయణను హత్య చేయాలని రెండు నెలల క్రితం పథకం రూపొందించారని తెలిపారు. ఇందులో భాగంగానే ఓ టిప్పర్‌ను కొనుగోలు చేసి లక్ష్మీనారాయణ కదలికలను గమనిస్తూ రెక్కీ నిర్వహిస్తూ వచ్చారు. గత నెల 27వ తేదీన కె.పెద్దన్న ఇంటి వద్ద సమావేశమై హత్యకు పక్కాగా ప్లాన్ చేశారన్నారు. అనుకున్న విధంగానే గత నెల ఏప్రిల్ 27వ మధ్యాహ్నం 2:15 గంటలకు గుంతకల్ నుంచి చిప్పగిరికి ఇన్నోవా వాహనంలో వస్తుండగా రైల్వే బ్రిడ్జి వద్ద మొలగవల్లికి చెందిన మేకల శ్రీనివాసులు అతివేగంగా టిప్పర్‌తో ఢీకొన్నాడు. వెనక కారులో ఫాలో చేస్తూ వస్తున్న పెద్దయ్య, వడ్డే నవీన్ వెంటనే కారు అద్దాలు పగలగొట్టి వెంట తెచ్చుకున్న వేట కొడవళ్లతో, ఇనుప రాడ్లతో తలపై నరికి హత్య చేశారు. మిగిలిన వారు ఆ మార్గంలో ఎవ్వరూ రాకుండా జాగ్రత్తలు వహించి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఈ హత్య కేసులో మిగిలిన ముద్దాయిలు కె.పెద్దన్న, బోయ మేకల శ్రీనివాసులు, బోయ గోవిందు, బోయ రాము, వడ్డే నవీన్, ధర్మ, మనోహర్‌లను కూడా త్వరలో పట్టుకుంటామని అడిషనల్ ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బాధితులు ముందుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జునచౌదరి, చికెన్ రామాంజనేయులు, అరికెర మల్లేష్‌ల ప్రమేయం ఉన్నట్లు వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి ఆధారాలు ఇప్పటి వరకు లభించలేదన్నారు. ఈ హత్య కేసును లోతైన దర్యాప్తు చేసి ఇందులో ఇంకా ఎవరి పాత్ర ఉందో విచారణ చేపట్టి అందులో ఎవరు ఉన్నా కచ్చితంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పోలీసులపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. హత్యకు గురైన చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబానికి గన్‌మెన్‌లు ఇచ్చే అంశం తమ పరిధిలో లేదన్నారు. చిప్పగిరిలో ఆయన నివాసం ఉంటున్న కాలనీలో పోలీసు పికెట్ కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో పత్తికొండ డీయస్పీ వెంకటరామయ్య, సీఐ రవిశంకర్ రెడ్డి, ఆలూరు, హొళగుంద, చిప్పగిరి ఎస్ఐలు మహబూబ్‌బాషా, దిలీప్‌కుమార్, ఏపీ శ్రీనివాసులు ఉన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి


కంబాలపల్లి గ్రామంలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాములపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంటలు సాగుచేసే ప్రతిరైతు భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కంబాలపల్లిలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఖచ్చితంగా రైతులు భూసారప రీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా ఎరువులు వాడటంతో పం ట దిగుబడులు పెంచుకోవచ్చన్నారు. పంటల్లో సూక్ష్మధాతువుల లోపా లను సవరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవపాయ విస్తరణ అధికారి దుర్గా చరణ్, వ్యవసాయ సహాయకులు గాయిత్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గంగా పుష్కరోత్సవం

మహానంది, మే 2 (ఆంధ్రజ్యోతి): వైశాఖ శుద్ధ సప్తమి పురస్కరిం చుకొని ఆదివారం మహా నంది క్షేత్రంలో వార్షిక గం గా పుష్కరోత్సవం నిర్వహి స్తున్నట్లు ఆలయ వేదపం డితులు చండూరి రవిశం కర్ అవధాని శుక్రవారం తెలి పారు. సప్తమి రోజు గం గాదేవి స్వయంగా మ హా నంది ఆలయ ప్రాంగణంలోని రుద్రగుండం నదీతీర్థంలో స్నానమా చరించి శుద్ధిని పొందుతుందని పురాణాల్లో ఉందన్నారు. అంతటి మహి మాన్వితమైన రుద్రగుండం కోనేరులో భక్తులు పుణ్య స్నా నాలు ఆచరించి బ్రహ్మహత్యాది మహా పాతకాల శుభాలను పొందాలని అన్నారు.


మహానందిలోని రుద్రగుండం కోనేరు

నేటి నుంచి నిరంతర దర్శనం

మహానంది క్షేత్రంలో వేసవి సెలవుల భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని శని, ఆది, సోమవారాల్లో నిరంతర దర్శనంను ఏర్పాటుచేసినట్లు ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సాధారణ రోజుల్లో యథావిధిగా ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఆలయ తలుపులు మూసివేసి తిరిగి రెండు గంటల నుంచి ఆలయ తలుపు తెరిచి రాత్రి 9:30 గంటల వరకు భక్తులకు దర్శనం ఉంటుందని చెప్పారు.


విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న దర్గా

ఘనంగా రోఖియాబీ ఉరుసు

మొక్కులు తీర్చుకున్న భక్తులు

వెలుగోడు, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోఖియాబీ ఉరుసును ఘనంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు గంధంను పురవీధుల గుండా ఊరేగించారు. ఉరుసును పురస్కరించుకొని పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఉరుసుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు.


ఉరుసులో నృత్యాలు చేస్తున్న యువత

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

వెలుగోడు, మే 2 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండ లంలోని రేగడగూడూరు, వాడాల గ్రామాల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శుక్రవారం పాములపాడు మండలంలోని పెంచి కలపల్లి గ్రామానికి చెందిన ఉపేంద్రగౌడ్ తన భార్యను చూడటానికి జూపాడు బంగ్లా మండలం తూడిచెర్ల గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో వెలుగోడు పరిధిలోని రేగడగూడూరు గ్రామ శివార్లలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొ న్నాయి. ఈ ప్రమాదంలో ఉపేంద్రగౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెలుగోడు ఎస్ఐ షాషావలి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిమిత్తం మృత దేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పెచ్చులూడుతున్నాయ్..!

భయాందోళనలో పోలీసులు

శిథిలావస్థలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ భవనం


కొత్తపల్లి పోలీస్‌స్టేషన్

పెచ్చులూడిన భవనం పైకప్పు

కొత్తపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు పెచ్చులూడుతుండటంతో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు భయాందోళన చెందుతున్నారు. 1999లో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఉమా మల్లేశ్వరరావు, ఎస్పీ మదనమోహన్ ఈ పోలీస్‌స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించారు. కేవలం 26 సంవత్సరాలకే ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గత నాలుగైదు ఏళ్ల క్రితమే సిమెంటు పెచ్చులూడుతుండటంతో అప్పటి ఎస్ఐలు మరమ్మతులు చేయించారు. అయినప్పటికీ మళ్లీ సిమెంటు పెచ్చులూడుతుం డటంతో పోలీసులు భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు. కనీసం 50 సంవత్సరాలైనా పదిలంగా ఉండాల్సిన పోలీస్‌స్టేషన్ భవనం అప్పటి కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నిర్మించడంతోనే శిథిలా వస్థకు చేరుకుందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పోలీస్‌స్టేషన్‌కు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి
- ఎంపీపీ ఆర్థర్ సైమన్

గోస్పాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య లే కుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆర్థర్‌సైమన్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాద ముందని, గ్రామాల్లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. తగిన సూనలుఇస్తూ వోఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచిం చారు. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా పనులు ఉదయమే 6గంటలకు ప్రారంభించాలన్నారు. వ్యవసాయాధికారి స్వప్నిక మాట్లా డుతూ ప్రభుత్వం జొన్నలను రైతుల వద్ద నుంచి క్వింటా రూ3371 కొనుగోలు చేస్తుందని, ఈక్రాప్ రైతులందరూ రిజిష్టర్ చేసుకుని జొన్నలను అమ్ము కోవాలని అన్నారు. ఏపీవో గంగన్న మాట్లాడుతూ ఉపాధి కూలీలకు తగిన జాగ్రత్తలు చెబుతూ ఫీల్డ్‌అసిస్టెంట్‌ల వద్ద వోఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉంచామన్నారు. సమావేశంలోలో మండల ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, రాజు, ఎంపీడీవో షేక్‌హమానుల్లా, తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్, ఈవోఆర్డీ నాగఅనసూయ, సర్పంచ్‌లు కాటంరెడ్డి సుధామణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్ సైమన్

వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి

ప్రత్యేక పూజా కార్యక్రమాలు ● భక్తులకు అన్నదానం


ఉమామహేశ్వర ఆశ్రమంలో శంకరజయంతి వేడుకల్లో భక్తులు


మహానందిలో ఆదిశంకరచార్యుల చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

నంద్యాల కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఉమామహేశ్వర ఆశ్రమంలో శుక్రవా రం వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా స్వామి సుధీరానంద స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శంకరాచార్యుల అష్టోత్తర శతనామావళి, భగవద్గీత సాంఖ్యయోగం లోని 2వ అధ్యాయంలోని ప్రవచనాలు చదివి వాటి సారాంశం గురించి చక్కగా వివరించారు. అన ంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళ్లప్పస్వామి, ఉమామహేశ్వర గురుపీఠ ఆశ్ర మ ట్రస్టు, భక్తమండలి సభ్యులు, భక్తులు, పా ల్గొన్నారు. బ్రాహ్మణ సేవాసమాఖ్య ఆధ్వ ర్యంలో గాయత్రీమాత దేవాలయంలో శంకర జయంతి సందర్భంగా అమ్మవారికి అభిషేకా లు, శంకరాచార్యుల పూజ కార్యక్రమం నిర్వ హించారు. ఈకార్యక్రమంలో బ్రాహ్మణసేవా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ మంటపంలో..

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం ఆదిశంకరుల 1237 వ జయంతి వేడుకలను ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాం గణంలోని కల్యాణ మంటపంలో ఆదిశంకరుల చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూ జలు జరిపారు. ఈ కార్యక్రమంలో పర్య వేక్షకుడు శశిధర్‌రెడ్డి, వేదపండితులు చండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ,ప్రధాన అర్చకులు అర్జునశర్మ, అర్చకులు శంకరయ్య శర్మ, పుల్లూరి జనార్ధన్‌శర్మతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ● బాధిత కుటుంబానికి బీమా సాయం అందజేత

ఆత్మకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ అధిష్టానం ఎప్పటికీ అండగా నిలుస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన వేల్పుల సుమిత్ర అనే టీడీపీ కార్యకర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అయితే టీడీపీ క్రియాశీలక సభ్యత్వం పొందిన సుమిత్రకు కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా మంజూరైన రూ.5లక్షల బీమా సొమ్మును శుక్రవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మరే ఇతర రాజకీయ పార్టీలో లేనివిధంగా కార్యకర్తల సంక్షేమం కోసం టీడీపీ ఎంతగానో పాటుపడుతోందని అన్నారు. గతంలో ప్రమాదశాత్తు మరణాలు సంభవించినట్లయితే రూ.2లక్షల వరకు సాయం అందించడం జరిగిందని, అయితే టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సాయాన్ని రూ.5లక్షల వరకు పెంచినట్లు గుర్తుచేశారు. కార్యకర్తలకు పార్టీ ఇస్తున్న భరోసాతో కోటికి పైగా టీడీపీ సభ్యత్వాలు జరగడం మామూలు విషయం కాదన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, వీఆర్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, నాయకులు రామ్మూర్తి, సుబ్బయ్య, న్యామత్, మన్సూర్ తదితరులు ఉన్నారు.


బాధితులకు బీమా సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

బాలికల సాధికారత అందరి బాధ్యత


పాములపాడు : ఎర్రగూడూరులో అంగన్‌వాడీ సెంటర్‌లో శిక్షణ


అబ్బీపురంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్ సావిత్రి

పాములపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సాధికారిత మనందరి బాధ్యత అని సూపర్‌వైజర్ లలిత ప్రభావతి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రగూడూరు గ్రా మంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో సూపర్వైజర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బా లికలు ఒకరి నొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్దేశించుకోవడం, తప్పనిసరిగా పాటించాల్సిన కొన్ని అంశాలను, నియమా లను సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బీపురంలో..

మహానంది: మండలంలోని అబ్బీపురం గ్రామంలో శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-1, 2లో చిన్నారులతో పాటు తల్లిదం డ్రులకు సమ్మర్ క్యాంపెయిన్‌ను అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, చంద్రలీల నిర్వహించారు. ఈసందర్భంగా వేసవిలో తీసుకోవాల్సిన జా గ్రత్తలు చిన్నారులకు ఎలాంటి ఆహారం అందించాలనే అంశాలతో పాటు కిశోర వి కాసం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించే ఏర్పాట్లపై అ వగాహన కల్పించారు. అలాగే గోపవరంలో అంగన్‌వాడీ టీచర్లు బోరెడ్డి ప్రసన్నలక్ష్మిదేవి, నిర్మల ఆధ్వర్యంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంప్‌పై శుక్రవారం సాయంత్రం చిన్నారు లతో పాటు తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళా పోలీసులతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను వినియోగించుకోండి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న మహి ళలతో కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారత కింద ప్రాథ మిక టైలరింగ్ శిక్షణపై శిక్షణ ఇచ్చేం దుకు బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, కాపు మహిళలకు ప్రభుత్వం శిక్షణ ఇస్తోం దన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవ ర్గానికి 500 మంది లబ్ధిదారులకు శిక్షణ పూర్తి అయిన తర్వాత కుట్టు మిషన్ పంపిణీ చేస్తుందని అన్నారు. జిల్లాలో 3441మందికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు.


కుట్టు శిక్షణ కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

మున్సిపాలిటీ మేనేజర్‌గా సుహ్రులత


బాధ్యతలు చేపడుతున్న సుహ్రులత

నందికొట్కూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపాలిటీ మేనేజర్‌గా యం. సుహ్రులత శుక్రవా రం బాధ్యతలు చేపట్టారు. ఎమ్మిగనూ రు మున్సిపాల్టీలో సీనియర్ అసిస్టెం ట్‌గా పనిచేస్తున్న ఆమెకు పదోన్నతి లభించింది. దీంతో సుహ్రులత మేనే జర్‌గా నందికొట్కూరు మున్సిపాల్టీకి ని యామకం కావడంతో ఆమె బాధ్య తలు స్వీకరించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి

మిడుతూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు ప్రో త్సహిస్తే చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని తలముడిపి రెండో అంగన్‌వాడీ కేంద్రంలో 'కిశోర వికాసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసి వారి భవిషత్తును నాశనం చేయవద్దని ఆమె సూచించారు. బాల్య వివాహాలు చేయడంతో జరిగే అనర్థాలను ఆమె వివరించారు. కార్య క్రమంలో మహిళా పోలీసులు, ఏఎన్ఎమ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, కిశోర బాలికలు తల్లులు పాల్గొన్నారు.

నేటి నుంచి జ్యోతుల మహోత్సవం

కొత్తపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయం నందు అమ్మవారి జ్యోతుల మ హోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తొగాట వీరక్షత్రీయ సంఘం సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 3వ తేదీ శనివారం రాత్రి నుంచి జ్యోతుల మహోత్సవ ప్రారంభ పూజా కార్యక్రమాలు, ఆదివారం తెల్లవారుజామున స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర వైశాఖ మాసం శుక్ల సప్తమి రోజు చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతుల ప్రజల్వన మహోత్సవాలు జరుపుతున్నట్లు తెలి పారు. ఈకార్యక్రమం సోమేశ్వరస్వామి దేవాలయం నుంచి అమ్మ వారి జ్యోతులు బయలుదేరి పురవీధుల గూండా ఉత్సవ కార్యక్ర మంతో ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

రామకృష్ణా డిగ్రీ కాలేజీకి జాతీయ అవార్డు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రామ కృష్ణా డిగ్రీ కళాశాలకు ఇండియా ఎలైట్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌స్టి ట్యూషనల్ ఎక్స్‌లెన్స్ వారిచే జాతీయస్థాయి అవార్డు వచ్చినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో అపూర్వమైన సేవలందించినందుకు ప్రతి ష్టాత్మక ఈఅవార్డును దక్కించుకోవడం గర్వకారణమని కళాశాల నిర్వాహకులు హేమంత్‌రెడ్డి, ప్రగతిరెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి అవా ర్డులు విద్యాప్రమాణాలను మరింత అభివృద్ధి చేసేందుకు దోహదం చేస్తాయని వారు వివరించారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఏడీఏ అంజనేయ

ఆత్మకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువుల, పురుగుమందుల దుకాణదారులు నిబంధనలు పాటించాలని ఆత్మకూరు ఏడీఏ అంజనేయ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో విత్తన, ఎరువులు, పురుము మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆయా దుకాణాదారులు రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను అప్‌డేట్ చేయాలని అన్నారు. బిల్లుల నిర్వహణ కూడా సక్రమంగా ఉంచాలని చెప్పారు. కాగా అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని చెప్పారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని అన్నారు. ఎరువుల డీలర్లు బయోమెట్రిక్ విధానం ద్వారానే ఎరువులను విక్రయించాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 5వ తేదీ వరకు ఫీజు చెల్లింపు గడువును పెంచినట్లు డీఐఈవో సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

రామకృష్ణారెడ్డికి లింగ్విస్టిక్ కన్నడ పట్టా

నంద్యాల కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన యువ రచయిత రామకృష్ణారెడ్డి మైసూర్‌లోని సెంట్రల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ నుంచి లింగ్విస్టిక్ కన్నడ పట్టా పొందాడు. కన్నడ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ విజయలక్ష్మి నుంచి రామక్రిష్ణారెడ్డి పట్టా అందుకున్నారు. శుక్రవారం రామ కృ ష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఇతర భాషలను అధ్యయనం చేయడంతో భాషా పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. కన్నడ భాషా ధ్యయనం చేసినందుకు సెంట్రల్ గవర్నమెంట్ నుంచి రూ.80 వేలు స్టైఫండ్ పొందానన్నారు. ఎక్కువ భాషలు నేర్చుకుంటే వివిధ రాష్ట్రాల మాండలికాలు, సంస్కృతి ఆచార వ్యవహారాలతో పాటు మాతృభాష మీద పట్టురావ డమే కాకుండా, భాష మీద మరింత మమకారం ఏర్పడుతుందన్నారు. కన్నడపట్టా పొందిన రామక్రి ష్ణారెడ్డిని వివిధసాహితీ సంఘాల ప్రతినిధులు అన్నెం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, రవీంద్రనాథ్ అభినందించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ అనంత డిగ్రీ కళాశాలలో ఈ నెల 5న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. శుక్రవారం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సంస్థ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకొని నిరుద్యోగ సమస్య నిర్మూలనకు జాబ్ మేళాలను తరచుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అనంత రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాలో 15 ప్రైవేటు కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, బీటెక్, పీజీ, పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే సమయంలో రెజ్యూమ్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్హత పత్రాలు తీసుకొని రావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 8790895790కు సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



పాత శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని పాత శివాలయంలో శుక్రవారం ఆదిశంకర జయంతి కార్యక్రమాన్ని పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి ఆ ధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆది శంకరాచార్య చిత్రపటాల వద్ద ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం, లలిత సహస్రనామం, దక్షిణామూర్తి గురుపాదుక పారాయణం మహిళలు సామూహికంగా నిర్వహించారు. అనంతరం అభినవ శంకరానందస్వామి మాట్లాడుతూ ధర్మప్రచారం అందరి బాధ్యతని అన్నారు. హిందూవుల సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. పంచగురు పాదుక పూజలు చేశారు. నంద్యాలకు చెందిన కృష్ణారెడ్డి భగవద్గీత పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదాంత గీతశివం ఫౌండేషన్ సభ్యులు, హిందూ సంఘ నాయకులు, ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ సల్లానాగరాజు, సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి, మహిళలు పాల్గొన్నారు.

జిల్లాలో 4,500 పక్కా గృహాలు పూర్తి

చాగలమర్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9,432 పక్కా గృహాలకుగాను 4,500 గృహాలు పూర్తయ్యాయని, మిగిలినవి మే చివరి నాటికీ పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ స్పెషల్ అధికారి ఓబులేసు సూచించారు. శుక్రవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన పక్కా గృహాలను వేగవంతం చేయాలని అన్నారు. జూన్ 12 నుంచి గృహ ప్రవేశ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70 వేలు, చెంచులకు రూ.లక్ష అదనపు సాయం మంజూరైందని అన్నారు. వివిధ దశల్లో ఉన్న గృహాలను పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నరసింహరావు, వర్క్ఇన్‌స్పెక్టర్లు ఓబులేసు, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

శిరివెళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల వెంకట్ అన్నారు. శిరివెళ్లలోని కటిక సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జెండాను ఆవిష్కరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక చట్టాలను రూపొందించిందన్నారు. వీటికి వ్యతిరేకంగా ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సికిందర్, లాల్ బాషా, ఆశా యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

బుగ్గనను విచారించాల్సిందే

- టీడీపీ నాయకుడు మర్రి రమణ

డోన్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న మద్యం భారీ కుంభకోణంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాత్రను తేల్చాల్సిందేనని టీడీపీ నాయకుడు మర్రి రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం కుంభకోణంలో మాజీ మంత్రి బుగ్గన పాత్రపై తమకు అనుమానాలు ఉండటం వల్ల గత సోమవారం విజయవాడలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిట్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. డోన్‌లో వైసీపీ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలను కూడా త్వరలోనే బయటకు తీసి ప్రజల ముందు ఉంచుతామన్నారు. సమావేశంలో పట్టణ టీడీపీ నాయకులు మద్దయ్యగౌడు, లారీల బాషా, టైలర్ ఖాజా, ధర్మవరం ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

బేతంచెర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఈ నెల 15 నుంచి 18వరకు మొట్టమొదటిసారిగా జరగబోయే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, మండల సీపీఐ కార్యదర్శి భార్గవ్ కోరారు. శుక్రవారం స్థానిక బేతంచెర్ల సీపీఐ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల నాయకులు రవి, ఎల్లకృష్ణ, మధు, ప్రదీప్, సాయి, దుశ్వంత్, నాగరాజు, సూర్యతేజ, బాలరాజు, అజామ్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

శిరివెళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ఇశ్రత్ బేగం శుక్రవారం తెలిపారు. 114 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 103 మంది హాజరయ్యారన్నారు. ఇందులో 101 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వీరిలో అత్యధికంగా సందీప్ దరహాస్ అనే విద్యార్థి వందకు 77 మార్కులు, ముడిమెల షణ్ముఖప్రియ 76 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఇశ్రత్ బేగం వెల్లడించారు.

జగదుర్తిలో గడ్డి వాముల దగ్ధం

డోన్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదుర్తి గ్రామంలో శుక్రవారం వర్రి, సొప్ప వాములు ప్రమాదవశాత్తు అగ్నికి దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. రైతు సుంకన్నకు రూ.70వేలు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారి రంగస్వామి గౌడు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది రాజశేకర్, సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

భూముల వేలంలో రూ.1.03 లక్షల ఆదాయం

బనగానపల్లె మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం దేవాదాయ శాఖ భూముల వేలం నిర్వహించారు. బహిరంగ వేలంలో 1.03లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో కామేశ్వరమ్మ తెలిపారు. కొన్ని సర్వేనంబర్లు వాయిదా పడినట్లు ఆమె తెలిపారు. అలాగే తలనీలాలు, చెప్పుల స్టాండ్ కు సంబంధించి వేలం పాటలు వాయిదా పడ్డాయన్నారు. ఈనెల 7వతేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- పాఠశాలల్లో మే 18 వరకు ప్రత్యేక తరగతులు
- ఉమ్మడి జిల్లాలో 15 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం
- మే 19 నుంచి జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

శిరివెళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులు రానున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. ఈ నెల 19వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 18 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పునశ్చరణ, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక ప్రణాళికకు సంబంధించి ప్రాథమిక విద్య డైరెక్టర్ కొన్ని మార్గదర్శకాలను జారీ చేశారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.



యర్రగుంట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

- **ఉమ్మడి జిల్లాలో ..**

పదో తరగతి వార్షిక ఫలితాల్లో నంద్యాల జిల్లా 81.85 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రం లో 17వ స్థానంలో, కర్నూలు జిల్లా 62.47 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్, మున్సిపల్ తదితర 284 ప్రభుత్వ పాఠశాలల్లో (ప్రైవేట్ పాఠశాలలు మినహాయించి) 15,832 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవ్వగా 11,808 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా జిల్లా వ్యాప్తంగా 4,024 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. కర్నూలు జిల్లాలో 10,500 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. దీంతో ఈ నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఈ విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు తరగతుల నిమిత్తం ఆయా సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆదేశాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఈ కార్యాచరణను డిప్యూటీ డీఈవోలు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు సైతం అందిస్తున్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి

పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం. విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా కేటగిరీలుగా విభజించి సులువైన పద్ధతుల్లో ముఖ్యమైన అంశాలను ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు బోధించేలా చర్యలు తీసుకున్నాం. పాఠశాలల్లో జరుగుతున్న పునశ్చరణ తరగతులను ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నాం.

- డీటీ శంకర్ ప్రసాద్, డిప్యూటీ డీఈవో, నంద్యాల

నాణ్యమైన ఉత్పత్తులను విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

కోవెలకుంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : డీలర్లు రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏడీఏ సుధాకర్ ఆధ్వర్యంలో సబ్ డివిజను పరిధిలోని ఉయ్యాలవాడ, దొర్నిపాడు, సజామల, అవుకు, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన ఎరువులు, క్రిమిసంహారక దుకాణాలకు చెందిన డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయాధికారి హాజరై మాట్లాడారు. ఎరువులు, విత్తనాలు, ఈసీ యాక్ట్ 1955 పరిధిలో ఉందని, ఎరువులు విత్తనాలు చట్టం పరిధిలో కొనుగోలు, విక్రయాలు జరుపాలన్నారు. రైతులకు తప్పనిసరిగా సంతకంతో కూడిన బిల్లులు ఇవ్వాలని సూచించారు. అధీకృత కంపెనీల నుంచి మాత్రమే నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలన్నారు. స్టాకు బోర్డు నిల్వలు, గరిష్ఠ ధర నమోదు చేయాలన్నారు. బీటీ పత్తి ధర ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మాలన్నారు. సీడ్ విత్తనాలు అమ్మినట్లు రుజువు అయితే చట్టపరంగా చర్యలు తీసుకుని డీలర్‌షిప్ రద్దుచేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆరు మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందితో భూసార పరీక్షలు, ఫార్మర్ రిజిస్టరు, ఖరీఫ్‌నందు శెనగ, పొలాలు ఖాళీగా పెట్టకుండా స్వల్పకాల పంటలైన మినుము, పెసర, సోయాబీన్, సజ్జ కందులు తదితర పంటలను సాగు చేసేలా వ్యవసాయ సిబ్బంది రైతులకు మోటివేట్ చేయాలన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు నిరంజన్, సుధాకర్‌రెడ్డి, జ్యోతి, ఏఈవోలు ఎంపీఈవో, వీఏఏస్ డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

అహోబిలంలో వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరుగుతున్న వైశాఖమాస శ్రీ నృసింహ జయంతి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎగువ అహోబిలంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. గరుత్మంతుడి చిత్రపటంతో కూడిన ధ్వజాన్ని ధ్వజస్తంభంపై ఆరోహణం చేశారు. అనంతరం స్వామి వార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామి మాట్లాడుతూ ఉత్సవాలలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా మహావిష్ణువు వాహనమైన గరుడని ప్రార్థిస్తూ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించినట్లు వివరించారు.



ఆలయంలో స్వామివార్ల ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు

కిషోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): కిషోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఆళ్లగడ్డ ఐసీడీఎస్ సీడీపీవో తేజేశ్వరి అన్నారు. శుక్రవారం చాగలమర్రిలోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర వికాసంపై వేసవి ప్రత్యేక సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జూన్ 10 వరకు సమ్మర్ క్యాంటీన్ ప్రోగ్రామ్, విలేజి కమిటీలు జరుగుతాయని అన్నారు. కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిషోర వికాస్ అవగాహన సదస్సులను అంగన్‌వాడీ వర్కర్లు నిర్వహించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రుద్రవరం : ప్రతి పల్లెలో కిశోర వికాసం కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం చిన్న కంబలూరు గ్రామంలో కిశోరవికాసంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని ఓబులంపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర్ వికాసంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మే 2నుంచి జూన్ 10వరకు కిషోర్ వికాస కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, వీవోఏలు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆళ్లగడ్డ ఐసీడీఎస్ సీడీపీవో తేజేశ్వరి

శిరివెళ్ల : కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని శిరివెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, ఐసీడీఎస్ శిరివెళ్ల సూపర్‌వైజర్ దీప్తి సూచించారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిరివెళ్లలోని 9, 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికల వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కిషోర్, సుభాషిణి, ఏఎన్ఎంలు మంజుల, లక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థాలకు మూలం

కొలిమిగుండ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు సమాజంలో అనేక అనర్థాలకు మూలమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలో బాల్య వివాహాలను నిర్మూలించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అనిత, మహిళా పోలీసు స్వప్న, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివానకు కూలిపోయిన వరండాలు

బేతంచెర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): గాలి, వానకు శుక్రవారం సాయంత్రం డోన్ రహదారిలోని ఐదు నాపరాళ్ల ఫ్యాక్టరీల వరండాలు కూలిపోయాయి. హెచ్. కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న రమేష్ స్టోన్స్ ఫ్యాక్టరీ యజమాని మద్దయ్య, కొమ్మూరి రామయ్య ఫ్యాక్టరీ, మద్దిలేటికి చెందిన ఫ్యాక్టరీ, నారాయణ ఫ్యాక్టరీ చెందిన వరండాలకు వేసిన రేకులు తీవ్ర గాలులకు కొట్టుకపోయ్యాయి. ఒక్కొక్క ఫ్యాక్టరీకి రూ.3లక్షల చొప్పున మొత్తం 12 లక్షల నష్టం వాటిల్లిందని ఫ్యాక్టరీ యజమానులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గిద్దలూరులో వేసవి శిక్షణ

సంజామల, మే 2(ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్రంలో వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటైంది. గ్రామంలోని విద్యార్థులకు పుస్తక నిక్షిప్త కేంద్రంలో నిర్వాహకులు మద్దిలేటి ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బహుమతులను పంచాయతీ కార్యదర్శి సురేష్ అందజేశారు. జూన్ 10 వరకు ఆటల పోటీలు, పుస్తక పఠనం, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

జోళాపురం పరిసర ప్రాంతాల పరిశీలన

బనగానపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోళాపురం గ్రామంలో పురాతనకాలంలో మానవుని ఆనవాళ్లు ఉన్న ప్రాంతాన్ని శుక్రవారం డోన్ ఆర్డీవో నరసింహులు, పురావస్తు అధికారి పూజిత పరిశీలించారు. ఈ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగకుండా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమలయ్య , వీఆర్‌వో గోవిందప్ప పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం: బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించి తన సహకారం అందిస్తామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శుక్రవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో చెర్వుపల్లె గ్రామానికి చెందిన క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో స్థానిక యువకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

కోవెలకుంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని నంద్యాల మహిళా పోలీసుస్టేషన్ సీఐ గౌతమి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో సాయంత్రం మహిళలతో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల గురించి డయల్ యువర్ 100, 112, శక్తి యాప్ మరియు బాల్యవివాహాల గురించివివరించారు. సమావేశంలో ఎస్ఐ మల్లిఖార్జున రెడ్డి, ఆళ్లగడ్డ సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

రుద్రవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఈఘటన రుద్రవరంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని విశ్వనాథ్ శర్మ అనే వ్యక్తి ఇంట్లో విద్యుదాఘాతంతో ఒకసారిగా మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండగా ఫస్ట్‌ఫ్లోర్‌లో ప్రమాదం చోటు చేసుకున్నది. దాంతో ప్రాణనష్టం తప్పింది. ఇంట్లో ఉన్న దుస్తువులు, బీరువా, వంటపాత్రలు కాలిదగ్ధమైయ్యాయి. సుమారు రూ. 10లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఒకసారిగా గ్రామస్థులంతా ఏకమై మంటలను ఆర్పేందుకు యత్నించారు. ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చాయి.

సొసైటీ ప్రత్యేకాధికారిగా రాచయ్య

కొలిమిగుండ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : హనుమంతుగుండం సహకార సంఘం ప్రత్యేకాధికారిగా రాచయ్యను మరోసారి ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది క్రితం సొసైటీల్లో చైర్మన్ల గడువు ముగిసిన తరువాత ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించారు. ప్రత్యేకాధికారుల గడువు ఆరునెలలు ముగియడంతో మరోసారి ప్రభుత్వం రెన్యువల్ చేసింది.

నేడు మంత్రి బీసీ కోవెలకుంట్లకు రాక

కోవెలకుంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : నేడు పట్టణానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రానున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారన్నారు. గతంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాన్ని మంజూరు చేయించారన్నారు. శనివారం ఉదయం 9గంటలకు భూమిపూజ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. అధికారులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

కారును ఢీకొన్న లారీ

- వ్యక్తికి తీవ్ర గాయాలు

కొలిమిగుండ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సమీపంలోని కస్తూర్బా పాఠశాల మలుపు వద్ద ఓ లారీ కారును ఢీకొన్న ఘటనలో ఇటిక్యాల గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇటిక్యాలకు చెందిన ఏసురత్నం తన స్నేహితుడితో కలిసి కారులో కొలిమిగుండ్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఏసురత్నానికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. కాగా, ఈఘటనలో కారు మొత్తం నుజ్జునుజ్జైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పశుగ్రాసం, విద్యుత్ తీగలు దగ్ధం

- రూ. మూడు లక్షలకు పైగా ఆస్తి నష్టం

కొలిమిగుండ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హనుమంతుగుండం గ్రామంలో పశుగ్రాసం, విద్యుత్ తీగలు దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.మూడు లక్షలు ఆస్తి నష్టం సంబంవించినట్లు బాధితుడు ఖాన్‌బాదర్ శుక్రవారం వెల్లడించారు. పశువుల మేత నిమిత్తం గ్రామ సమీపంలోని పొలంలో గడ్డి నిల్వచేసి ఉండగా, గుర్తు తెలియనివ్యక్తులు నిప్పు పెట్టడంతో పశుగ్రాసంతో పాటు, విద్యుత్ తీగలు, స్టాటరు దగ్ధమైనట్లు బాధితుడు అనుమానం వ్యక్తం చేశారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేయండి

కోవెలకుంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆలయాన్ని ప్రతిష్ఠించి నేటికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసంఘం పట్టణ అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేడులను విజయవంతం చేయాలని కోరారు. వేడుకలకు రోడ్లుభవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈవేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

7 నుంచి బ్రహ్మోత్సవాలు

కోవెలకుంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వెలసిన పురాతన పాండురంగ దేవాలయంలో పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 నుంచి 17వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పాండురంగ స్వామి ఆలయ చైర్మన్ గుండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 7న బుధవారం రాత్రి కోట తిరునాల, 8న రాత్రి పేటతిరునాల, 9న శుక్రవారం తెల్లవారుజామున 4గంటలకు చిత్తనక్షత్రంలో స్వామివారి కల్యాణం, 10న రాత్రి హనుమద్‌వాహనం, 11న రాత్రి సింహవాహనం, 12న రాత్రి శేష వాహనం, 13న రాత్రి గరుడవాహనం, 14న రాత్రి గజేంద్ర వాహనం, 15న ఉదయం 10.30గంలకు పూర్ణాహుతి, సాయంత్రం 4గంటలకు రథోత్సవం, 16న సాయంత్రం 4గంటలకు మైలతిరునాల, 17న ఉదయం 10గంలకు చక్రస్నానం (తీర్థవాది) వసంతోత్సవం రాత్రి 8గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా బందేషావలి ఉరుసు

చాగలమర్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం వీధిలో వెలసిన బందేషావలి దర్గా వద్ద శుక్రవారం ఉరుసు ఘనంగా నిర్వహించారు. దర్గా వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఫాతెహాలు చేశారు. బెంగుళూరుకు చెందిన కళాకారులతో ఏర్పాటు చేసిన ఖవాలి ఆకట్టుకుంది. దర్గా సమీపంలో భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మహబూబ్‌బాష, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కిషోర్‌రెడ్డికి మాట్లాడే హక్కు లేదు'

ఆళ్లగడ్డ, మే 2 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం గురించి మాట్లాడే హక్కు వైసీపీ నాయకుడు కిషోర్‌రెడ్డికి లేదని జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్య అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు సనాతన ధర్మం గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్కడ ఏ సంఘటనను ఉపేక్షించకుండా భక్తుల మనోభావాలను కాపాడుతూ వస్తున్నారన్నారు. అనవసరంగా నోరు పారేసుకోకుండా వాస్తవాలు మాట్లాడాని ఆయన హితవు పలికారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

చాగలమర్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): బడిబయట ఉన్న పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. శుక్రవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బడిబయట ఉన్న 650 మంది పిల్లలను గుర్తించామని, వారందరిని బడిలో చేర్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. సీఆర్పీ, పీఆర్పీ, ఐఈఆర్పీలతో డ్రాపౌంట్స్ ఎంట్రోల్‌మెట్ సర్వే చేస్తున్నామని అన్నారు. మే చివరి వరకు సర్వే నిర్వహించి బడిబయట పిల్లలందరిని బడిలో చేర్పిస్తామని అన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి

చాగలమర్రి, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డీఎస్సీ 2003 ఫోరం జిల్లా కన్వీనర్ డెన్ని జాన్సన్ కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెమో నంబర్ 57 ప్రకారం అర్హులైన డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ఫోరం నిర్ణయించిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా పోస్టు కార్డుల ద్వారా మన వాణిని సీఎం, డిప్యూటీ సీఎం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులకు తెలియజేయనున్నట్లు తెలిపారు. మే రెండో వారం నుంచి ప్రతి జిల్లాలోని ప్రజాప్రతినిధులకు పోస్టు కార్డుల ద్వారా మనవాణి తెలియజేస్తామన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

బేతంచెర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీలో నివాసముంటున్న బాలుడి సయ్యద్ మొహిద్దీన్ (4)ను అతికిరాతకంగా కుక్కలు దాడి చేసి చంపాయి. విషయం తెలిసిన వెంటనే బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాలుని తల్లిదండ్రులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుక్కల నియంత్రణ విషయంలో అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వారి దృష్టికితెచ్చారు. ఇక నుంచి ఇలాంటి జరగకుండా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి: సీపీఐ

బాలుడి మృతికి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా కింద రూ.25లక్షలు చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు. బేతంచెర్ల హనుమాన్‌నగర్‌కు చెందిన నాలుగేళ్ల బాలుడుని వీధి కుక్కలు దాడి చేసి చంపడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికార యంత్రాంగం స్పందించి బాలుడి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.